విలేఖరులు కావలెను

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభ' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

ఫోన్ - 8985829417



# సూర్య ప్రభ

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 1 సంచిక: 353 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | శుక్రవారం, జూన్ 13 2025 | పేజీలు : 4




# నష్టం జరగక ముందే అప్రమత్తమవ్వండి...!

## భారీ వర్షాలు, వరద ముప్పుపై సమీక్షించిన మంత్రి పొంగులేటి

## ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా జాగ్రత్త పడాలని అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

హైదరాబాద్ : ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణ కంటే ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గోదావరి కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వీలైనంతవరకు ప్రాణ, ఆస్తి, ఆర్థిక నష్టం జరగకుండా ఇప్పటి నుండే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లతో గురువారం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి పొంగులేటి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన తర్వాత స్పందించేదానికంటే నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్రస్థాయిలో వరద ప్రభావిత ప్రాంతాలలో చేపట్టవలసిన చర్యలు, విపత్తుల నిర్వహణ విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్, అగ్నిమాపక డీజీ, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్, నీటిపారుదల, ఆర్అండ్‌బీ, ఆరోగ్య శాఖల కమిషనర్లతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ కమిటీ వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని.. ఆ నివేదిక ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు.

**గతేడాదికి మించి వర్షాలు పడే ఛాన్స్...** ఈ ఏడాది వర్షాకాల సీజన్ అనుకున్నదానికంటే 15 రోజుల ముందుగానే వచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విభాగాలతో సమన్వయం చేసుకొని ప్రకృతి వైపరీత్యాల ప్రభావం వీలైనంత వరకు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పొంగులేటి సూచించారు. గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రదేశాలలో జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో హఠాత్తుగా వచ్చే వర్షాలతో ఊహించని వరదలు వస్తున్నాయని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు.

నిర్వాసితులను గుర్తించి వారిని అక్కడి నుంచి శాశ్వతంగా తరలించి వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది పరివాహక ప్రాంతాల్లో తక్కువ సమయంలో ఎక్కువ వర్షం పడడం వల్ల నష్టం ఎక్కువగా జరిగిందని.. ఈసారి కూడా అటువంటి పరిస్థితి ఎదురైతే నష్టాన్ని తగ్గించే విధంగా ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

**మూస పద్ధతికి స్వస్తి చెప్పండి..** రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ మూస పద్ధతికి స్వస్తి చెప్పి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేయాలని పొంగులేటి ఆదేశించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు, నిర్వహణ, ముందస్తు హెచ్చరికల కోసం అవసరమైన యూజర్ ఐడీలను ఇవ్వాలని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఆయా జిల్లాల్లో పరిస్థితులను బట్టి వరదల కార్యాచరణ ప్రణాళికలను ఈనెల 30వ తేదీలోగా తయారు చేసుకోవాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆపద మిత్ర వాలంటీర్స్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సహాయంతో సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వరద నియంత్రణ కట్టలు, చిన్న-మధ్య తరహా కాల్వలు, వర్షపు నీటి డ్రెయిన్‌లు మొదలైన వాటిని పరిశీలించి రిపేర్లు చేయించాలన్నారు. రిలీఫ్ క్యాంపుల ప్రదేశాలు, సంప్రదించవలసిన నెంబర్లు మొదలైనవి ఉండాలన్నారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, అత్యవసర, పొడి ఆహార కిట్లు ముందే సిద్ధంగా ఉంచాలన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్య శాఖల సామాన్యంతో పనిచేయాలని కంట్రోల్ రూములు ప్రారంభించాలని అత్యధిక ప్రమాద ప్రాంతాలలో స్థానిక రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. మొబైల్ వైద్య బృందాలు, అవసరమైన మందులు, నీటి శుద్ధి మాత్రలు, పారిశుధ్య కిట్లు వంటివి తగిన మొత్తంలో అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ హరీష్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయితీరాజ్ కమిషనర్ సృజన, సీపీ డీసీఎల్ డైరెక్టర్ ముష్రాఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి.గోపి, ఐఎండీ అధికారి నాగరత్నం, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల్, ములుగు, నిర్మల్, వనపర్తి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.




## భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు

హైదరాబాద్: తెలంగాణలో 36 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్.శ్రీధర్ - పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి. గనులశాఖ ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు. లోకేశ్ కుమార్- రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి. నవీన్ మిత్తల్- ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి. జ్యోతి బుద్ధప్రకాష్ -ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి. శశాంక్ గోయెల్ - దిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్. హరిచందన దాసరి- హైదరాబాద్ కలెక్టర్ . రాజీవ్‌గాంధీ హనుమంతు- రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సెక్రటరీ, ఐజీ. భారతి లక్‌పతి నాయక్ - సమాచార శాఖ కమిషన్ కార్యదర్శి. కిల్లు శివకుమార్ నాయుడు -ఆర్అండ్ఆర్ కమిషనర్. చిట్టెం లక్ష్మి - సాధారణ పరిపాలన విభాగం సంయుక్త కార్యదర్శి. ఇ.నవీన్ నికోలస్ - స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్. టి.వినయ్ కృష్ణారెడ్డి- నిజామాబాద్ కలెక్టర్. సృజన- మహిళాశిశుసంక్షేమశాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు. ఎల్.శివశంకర్- వ్యవసాయ సహకార శాఖసంయుక్త కార్యదర్శి, విపత్తు నిర్వహణ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు. కె.హైమావతి- సిద్దిపేట కలెక్టర్. పి.గౌతమ్- సింగరేణి డైరెక్టర్. వాసం వెంకటేశ్వర్‌రెడ్డి- ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ డైరెక్టర్. కె.నిఖిల- మత్స్యశాఖ డైరెక్టర్. వల్లూరు క్రాంతి- పర్యాటకశాఖ ఎండీ. పి.ఉదయ్ కుమార్- ఆరోగ్యశ్రీ హెల్త్ ట్రస్ట్ సీఈవో. ప్రియాంక ఆల- టీజీపీఎస్సీ కార్యదర్శి. పి.ప్రావిణ్య- సంగారెడ్డి కలెక్టర్. మిక్కిలినేని మను చౌదరి- మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్. అనుదీప్ దురిశెట్టి- ఖమ్మం కలెక్టర్. స్నేహ శబరీష్- హనుమకొండ కలెక్టర్. ముజామిల్ ఖాన్- పౌరసరఫరాలశాఖ డైరెక్టర్.




## ఈనెల 14న గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవం

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవం ఈనెల 14న జరగనుంది. ఈ మేరకు టీఎఫ్డీసీ ఛైర్మన్ దిల్ రాజు మీడియాకు వివరాలు అందించారు. అహ్మదాబాద్ లో జరిగిన విమాన ప్రమాద నేపథ్యంలో ఈ మీడియా సమావేశానికి పలువురు మంత్రులు హాజరు కాలేకపోయారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా ఈ అవార్డులు అందిస్తున్నామని తెలిపిన దిల్ రాజు.. ఈనెల 14న సాయంత్రం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ వేడుక జరుగుతుందని వెల్లడించారు. 2014 నుంచి 2023 వరకు ఎన్నికైన ఒక్కో ఉత్తమ చిత్రానికి ఉత్తమ హీరో, హీరోయిన్, డైరెక్టర్, ప్రొడ్యూసర్ లు మొత్తం నాలుగు అవార్డులు అందుకుంటారని తెలిపారు. 14 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ వేడుకలకు అందరూ హాజరై, విజయవంతం చేయాలని దిల్ రాజు కోరారు.

# అహ్మదాబాద్‌లో కూలిన ఎయిరిండియా విమానం!

# గాల్లో కలిసిన ప్రాణాలు!




## మృతుల్లో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు, 7 పోర్చుగీస్, ఒకరు కెనడియన్, 12 మంది విమాన సిబ్బంది

గాంధీనగర్, జూన్ 12: అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మొత్తం 242 మంది మరణించారు. ఈ జాబితాలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు, 7 పోర్చుగీస్, ఒకరు కెనడియన్, 12 మంది విమాన సిబ్బంది ఉన్నారు. ఈ విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాని సైతం మరణించారు.

**50 మృతదేహాలు..** మరోవైపు 50 మృతదేహాలను విమాన శకలాల నుంచి వెలికి తీశారు. సహాయక చర్యలు కొనసాగుతోన్నాయి. ఎయిర్ పోర్ట్ నుంచి బయలుదేరే అన్ని విమానాలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎయిర్ పోర్టు అధికారులు ప్రకటించారు.

**మాజీ సీఎం విజయ్ రూపానీ..** ఇంకోవైపు ఈ విమానంలో ప్రయాణిస్తున్న గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ మరణించారు. ఆయన కుమార్తె లండన్‌లో నివసిస్తుంది. ఈ నేపథ్యలంలో ఆమె వద్దకు వెళ్లేందుకు ఆయన లండన్ ప్రయాణమయ్యారు. ఇక ఆయన భార్య అంజలి రూపానీ లండన్‌లో ఉన్నారు. ఆమెను తీసుకు వచ్చేందుకు ఆయన లండన్ పయనమైనట్లు విజయ్ రూపానీ కుటుంబ సభ్యులు వివరించారు.

**230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది..** అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన విమానంలో మొత్తం 230 మంది ప్రయాణికులు ఉన్నారు. మరో 12 మంది విమాన సిబ్బంది ఉన్నారు. వీరంతా ఈ ప్రమాదంలో మరణించారు. ఫ్లైట్ రాడార్ 24 ప్రకారం విమానం 625 అడుగుల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ కోల్పోయింది. ఈ క్రమంలో మధ్యాహ్నం 1.39 సమయంలో పూర్తిగా కిందకు దిగిపోయి చెట్టును ఢీకొన్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదానికి గురైన విమానం వైడ్‌బాడీ బోయింగ్ 787 డ్రీమ్ లైనర్. దీనిలో 300 మంది ప్రయాణించవచ్చు. ఇది 11 ఏళ్లుగా సేవలు అందిస్తోంది. సుదూర ప్రయాణం కావడంతో విమానంలో ఇంధనం కూడా భారీ ఉండటంతో.. ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. విమాన కూలిన విషయం తెలియగానే ఫైర్ ఇంజిన్లు ఆ ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా ఆ విమానంలో ఉన్నట్లు ఏబీపీ పత్రిక పేర్కొంది. ఈ ప్రమాదం విషయం తెలియడంతో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఘటనా స్థలానికి బయల్దేరారు. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి తెలుసుకొన్నారు. ఈ ప్రమాదంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) స్పందించింది. విమానానికి కెప్టెన్‌గా సుమిత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్‌గా క్లైవ్ కుందర్ వ్యవహరించినట్లు పేర్కొంది. సుమిత్‌కు ఎల్‌టీసీగా 8,200 గంటలు, కోపైలట్‌కు 1,100 గంటల అనుభవం ఉన్నట్లు వెల్లడించింది. ఏటీసీ నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ విమానం రన్‌వే 23 నుంచి గాల్లోకి ఎగిరినట్లు తెలిపింది. కొద్ది సేపటికే ఆ ఎయిర్ క్రాఫ్ట్ నుంచి ఏటీసీకి మేడేకాల్ (అత్యవసర కాల్) వచ్చిందని వెల్లడించింది. ఆ తర్వాత కూలిపోయినట్లు పేర్కొంది. మరోవైపు ఎయిర్ ఇండియా కూడా ఎక్స్ వేదికగా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులతో పాటు ఒక కెనడా వాసి ఉన్నట్లు వెల్లడించింది. ఈ ప్రమాదంపై సమాచారం కోసం హాట్‌లైన్ నెంబర్ 1800 5691 444 ఏర్పాటు చేసినట్లు తెలిపింది. తమ సామాజిక మాధ్యమం, ఎయిర్‌ఇండియా వెబ్‌సైట్‌లో కూడా ప్రమాద వివరాలు, అప్‌డేట్లు ఉంటాయని పేర్కొంది. ప్రమాదం జరిగిన వెంటనే తదుపరి ప్రకటన వెలువడే వరకు అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో ఫ్లైట్ ఆపరేషన్స్‌ను సస్పెండ్ చేశారు.

## మేడ్చల్ ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజుకు జన్మదిన వేడుకలు...

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రబా)బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సమక్షంలో ఘనంగా మేడ్చల్ ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజుకు జన్మదిన వేడుకలు...తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఫిషరీస్





కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజును శాలువాతో సత్కరించిన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ , మన్నె రాజు తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంకట స్వామి, యూసుఫ్, ప్రభాకర్, పందిరి యాదగిరి, గుబ్బల లక్ష్మీనారాయణ, చారి, మహిళా నాయకురాలు దేవి తదితరులు పాల్గొన్నారు.

## లక్షలు వెచ్చించి.. వినియోగం మరిచి

సారంగాపూర్ : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఊరూరా డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్(కంపోస్టు) షెడ్లు నిర్మించారు. జిల్లా వ్యాప్తంగా 380 పంచాయతీలలో కంపోస్టు షెడ్ల నిర్మాణం చేపట్టగా తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షల చొప్పున వ్యయం చేశారు. ఆరంభంలో కొన్ని పంచాయతీలు ఎరువు తయారు చేసినప్పటికీ వ్యయం అధికంగా ఉండడం, పంచాయతీలలో సిబ్బంది కొరతతో మానేశారు. కొద్ది రోజులు ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టడంతో తయారు చేసిన ఎరువును చూపించారు. కొన్నేళ్లుగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పూర్తిగా మానేయడంతో రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించిన షెడ్లు నిరుపయో గంగా ఉంటున్నాయి.

**సిబ్బంది లేక ఇబ్బంది**

గ్రామ జనాభా ప్రాతిపదికన పంచాయతీ కార్మికులను నియమించుకో వాల్సి ఉంటుంది. ఒక్కో పంచాయతీలలో ఒక్కరు, ఇద్దరు మినహా ఎక్కువగా నియమించుకునే అవకాశం లేదు. నియమించుకున్న ఒకరిద్దరు చెత్త ట్రాక్టర్ నడపడమే కాకుండా, నీటి సరఫరా, చెత్త సేకరణ తదితర పనులు చేయాల్సి ఉంటుంది. సేకరించిన చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చే సమయం ఉండడంలేదు. అధికారులు ఉపాధి హామీ పథకం కూలీల ద్వారా చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చేందుకు అవకాశం కల్పిస్తే పంచాయతీలకు ఆదాయంతోపాటు లక్ష్యం నెరవేరనుంది.

**భారంగా చెత్త తరలింపు**



కొంత కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల విడుదల లేకపోవడంతో చెత్త తరలింపు భారంగా మారింది. ప్రభుత్వం అందించిన ట్రాక్టర్లకు కిస్తీలు చెల్లించలేని పరిస్థితి కొన్ని పంచాయతీల దైతే.. మరికొన్ని పంచాయతీలకు నిధులు లేక మరమ్మతు చేయించలేక మూలన పడేశారు. పంచాయతీల ట్రాక్టర్‌తోపాటు ఇతర పరికరాలు కూడా కొనుగోలు చేసి వినియోగించకుండా పక్కన పడేయడంతో ప్రజాధనం వృథా అవుతోంది. పంచాయతీలకు నిధులు మంజూరుచేసి సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

**కానరాని సేంద్రియ ఎరువు తయారీ**

గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించేందుకు ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ కొనుగోలు చేశారు. ఇంటింటికీ తడి, పొడి చెత్తను సేకరించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడి సెగ్రిగేషన్ షెడ్లలో ప్రత్యేకంగా నిర్మించిన చిన్న గదులలో సేకరించిన చెత్త నుంచి ప్లాస్టిక్, ఇతర వస్తువులు వేరు చేయాల్సి ఉంటుంది. తడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంటుంది. ఎరువును గ్రామాల్లోని హరితహారం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు వినియోగించాలి. మిగిలిన ఎరువును రైతులకు విక్రయి ంచాలి. ఎక్కడ కూడా సేంద్రియ ఎరువు తయారీ చేపట్టడం లేదు.

## కా'సారం'.. పునరుజ్జీవం



హైదరాబాద్: భాగ్యనగరంలో చెరువులు జీవం పోసుకుంటు న్నాయి. ఇప్పటికే ఆక్రమణల నుంచి విముక్తి పొందిన తటాకాలకు.. మురుగు నుంచి కూడా శాశ్వత పరిష్కారం లభిస్తోంది. అన్నిటికంటే గొప్పగా కాసారాలు పాతకాలంలోని తమ నేలతో మమేకం అవుతున్నా యి. హద్దుల వరకు విస్తరిస్తున్నాయి. హైడ్రా చేపట్టిన ఆయా కార్యక్రమాలతో సత్ఫలితాలు చేకూరనున్నాయి.

**తమ్మిడికుంట విస్తీర్ణం రెట్టింపు..**

స్థానికుల ఫిర్యాదుతో మాదాపూర్‌లోని తమ్మిడికుంట ఆక్రమణలపై హైడ్రా విచారణ చేపట్టింది. కుంట వాస్తవ విస్తీర్ణం 29 ఎకరాల 24 గుంటలు. పూర్తిస్థాయి నీటి మట్టం(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో కలిపి 84 కట్టడాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అందులోని ఎకరం 12 గుంటల ఎఫ్‌టీఎల్, 2 ఎకరాల 18 గుంటల బఫర్‌జోన్‌లో ఎన్-కన్వెన్షన్ నిర్మాణాలు ఉన్నట్టు తేలింది. వాటిలోని వ్యాపార కార్యకలాపాలు జరుగుతోన్న నిర్మాణాలను ఆగస్టు 24న హైడ్రా నేలమట్టం చేసింది. జనాలు నివాసం ఉండే అపార్ట్‌మెంట్లను వదిలేసింది. అయినప్పటికీ.. 14 ఎకరాలకు కుంచించుకుపోయిన దాని విస్తీర్ణం 28 ఎకరాలకు పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. ఎకరా భూమిలో మీటరు లోతున గుంత తీస్తే 4 మిలియన్ లీటర్ల నీటిని నింపొచ్చు. దాని ప్రకారం ఆక్రమణల తొలగింపు ద్వారా సమకూ రిన 14 ఎకరాల్లో సగటు మీటరు నుంచి రెండు మీటర్ల లోతున పూడిక తొలగింపు జరుగుతోంది. తద్వారా గతంతో పోలిస్తే తమ్మిడికుం టలో 22 కోట్ల లీటర్ల నీరు నిల్వ ఉండగలదని అధికారులు అంచనా వేస్తున్నారు. నల్లచెరువులోనూ ప్రగతి పనులు కొనసాగుతున్నాయి.

**అంతా మంచి నీరే..**

ప్రస్తుతం చెరువులోకి చేరుతోన్న మురుగును దారి మళ్లించేందుకు చుట్టూ కాలువ రాబోతుంది. వరద వచ్చినప్పుడు మాత్రమే తటాకంలోకి నీరు చేరేట్టు గుత్తేదారు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. వరదతో కలిసి వచ్చే మురుగు, వ్యర్థాలను వడపోసేందుకు ప్రత్యేకంగా కుంటను ఏర్పాటు చేస్తోంది. అందులో నీరంతా వడపోతకు గురై మధ్యలో ఉ న్న తటాకాన్ని చేరుతోంది. తద్వారా.. దాంట్లో ఏడాది పొడవునా మంచి నీరు నిల్వ ఉంటుంది.

మంచినీటితో కళకళలాడే కాసారాలతో పర్యావరణానికి ప్రయోజనాలు చేకూరుతాయి. గ్రేటర్ పరిధిలో ప్రస్తుతం 150 చెరువులు ఉన్నాయి.

**మరో ఐదు చోట్ల..**

కాటేదాన్‌లోని బమ్ రుఖ్ నుద్దౌలా చెరువులో 9 ఎకరాల విస్తీర్ణంలోని ఆక్రమణలను, సున్నం చెరువులో 5 ఎకరాల్లోని కబ్జాలను హైడ్రా తొలగించింది. కూకట్‌పల్లిలోని నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటలనూ హైడ్రా ఆక్రమణల నుంచి రక్షించింది. ఇప్పుడు వాటికి గత వైభవాన్ని తెచ్చేందుకు పూడికతీత చేపట్టింది. జూన్ ఆఖరు నాటికి రూ.100కోట్లతో 6 తటకాలను పూర్వస్థితికి తీసుకొస్తామని హైడ్రా స్పష్టం చేస్తోంది.

## ఇసుక తీస్తూ.. వాగును కబ్జా చేస్తూ..



వేములవాడ : కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా మూలవాగును ఆక్రమిస్తున్నారు. వాగులోని ఇసుకను తోడేసి వ్యవసాయ క్షేత్రాల వెంబడి కట్ట పోసి ఆక్రమిస్తున్నా రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**ఆందోళనకరంగా..**

వేములవాడ పట్టణంలోని మూలవాగు వంతెనకు ఇరువైపులా పట్టణ శివారు ఆనుకొని మూలవాగు ఉంటుంది. ఈ మూలవాగు ప్రతి వర్షాకాలంలో భారీ ఎత్తున పారి.. వరద నీరంతా మధ్యమానేరు జలాశయంలోకి చేరుతుంది. పట్టణానికి కొద్ది దూరంలో మహాలక్ష్మి వీధి ప్రాంతంలో కొన్ని రోజులుగా అ ప్రాంతంలోని రైతులు మూలవాగు బఫర్ జోన్‌నే కాకుండా ఏకంగా వాగును కబ్జా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాగులో భారీ యంత్రాలు పెట్టి ఇసుకను తీసి వాగులోనే వందల మీటర్ల పొడవు అడ్డుకట్ట వేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. వాగు ఆక్రమణ కారణంగా తమకు నష్టం జరుగుతుందని వాగుకు అవతలి వైపు రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**బఫర్ జోన్ ఆక్రమణ**

మూలవాగు వంతెనకు ఇరువైపుల బఫర్ జోన్ పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయి. పలువురు భవనాలు నిర్మాణం చేశారు. ఇదే వాగు వెంబడి మహాలక్ష్మి వీధిలో ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలోని మూలవాగు ఆక్రమణకు గురవుతోంది. వాగుకు ఇరువైపులా దాదాపు 9 మీటర్ల వెడల్పు బఫర్ జోన్ ఉంటుంది. ఇలాంటి స్థలాన్ని ఎవరు అక్రమించడా నికి లేదు. అలాంటిది బఫర్ జోన్‌తో పాటు మూలవాగును సైతం ఆక్రమించి పెద్దఎత్తున కట్ట పోసే పనులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం లేదు. దీంతో ఆక్రమణలు విస్తరిస్తున్నాయి. ఇసుక అక్రమంగా తీసి కట్ట పోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

**నిబంధనలు తుంగలో తొక్కి..**

నిబంధనల ప్రకారం వాగులో ఇసుక, మట్టిని తీసేందుకు భారీ వాహనాలను వినియోగించరాదు. ఉయోగించాలంటే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు పొందాల్సి ఉంటుంది. అనుమతులు లేకుండానే జేసీబీని ఏర్పాటు చేసి వందల మీటర్ల పొడవు మూలవాగులో భారీగా ఇసుకను తీసి కట్ట పోసి చదును చేయడం విమర్శలకు తావిస్తోంది. కట్ట కోసం మూలవాగులో వేల ట్రిప్పుల ఇసుక తీయడంతో చిన్నపాటి కుంటను తలపిస్తోంది. భారీగా ఇసుక తోడేయడంతో గుంతలతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది.

**పరిశీలించి చర్యలు** మూలవాగులో ఇసుక తీసి కట్ట పోసిన ప్రాంతాన్ని పరిశీలించి అందుకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం. యంత్రాలు పెట్టి తవ్వకాలు చేసేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. పూర్తి స్థాయిలో పరిశీలించి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం. శ్రీనివాస్, నీటిపారుదలశాఖ డీఈ, వేములవాడ

## నాణ్యతే ప్రామాణికం



గోదావరిఖని : వినియోగదారులకు మరింత నాణ్యమైన బొగ్గు విక్రయించేందుకు సింగరేణి ప్రయత్నిస్తోంది. నాణ్యత ప్రామాణికంగానే మార్కెట్ పెంచుకునే వీలు ఉండటంతో ఆ దిశగా సంస్థ ఆలోచన చేస్తోంది. సాధ్యమైనంత మేర క్వాలిటీ బొగ్గు సరఫరాకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే అనేక విధాలుగా వినియోగదారులకు నాణ్యతపై నమ్మకం కలిగిస్తూ.. కొత్త వారిని ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఈ మేరకు సింగరేణి వ్యాప్తంగా మరిన్ని బొగ్గు శుద్ధి కేంద్రాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటోంది. గనుల్లో ఉత్పత్తి చేస్తున్న బొగ్గు నుంచి బండ, మట్టిని వేరుచేస్తారు. అనంతరం శుద్ధి కేంద్రాల్లో శుభ్రం చేసి సరఫరా చేస్తారు. దీంతో ధర ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

**తక్కువ గ్రేడ్ బొగ్గు**

సింగరేణి గనుల్లో చాలా వరకు తక్కువ గ్రేడు బొగ్గు ఉత్పత్తవుతోంది. జి-9 నుంచి జి-13 గ్రేడు బొగ్గు ఉంటుంది. ఆరు జిల్లాల పరిధిలోని గనుల్లో ఎక్కువ శాతం ఈ గ్రేడు బొగ్గు నిల్వలే ఉన్నాయి. కేవలం భూపాలపల్లి ప్రాంతంలో కొంత వరకు మాత్రమే కొద్ది వరకు నాణ్యమైన బొగ్గు నిల్వలున్నాయి. దీనివల్ల బొగ్గుకు రేటు తక్కువగా పలుకుతోంది. ఈ బొగ్గును పూర్తి స్థాయిలో శుభ్రం చేసి సరఫరా చేయడం ద్వారా కొంతవరకు నాణ్యత పెరిగి ధర వస్తోంది. ఇప్పటికే మణుగూరు, బెల్లంపల్లి రీజియన్, కొత్తగూడెం ప్రాంతాల్లో బొగ్గు శుద్ధి కేంద్రాలున్నాయి. రామగుండం ప్రాంతంలో ఉన్న కేంద్రం పలు కారణాల వల్ల ప్రస్తుతం నడవటం లేదు. తాజాగా సత్తుపల్లి ప్రాంతంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**కొత్త వినియోగదారులపై దృష్టి**

సింగరేణి ఎన్టీపీసీ, జెన్‌కోతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గు విక్రయిస్తోంది. కొత్త వినియోగదారులను సమకూర్చుకోవడానికి దృష్టి పెట్టింది. ఈ మేరకు ఇటీవల నాణ్యత వారోత్సవాల సందర్భంగా ఉత్పత్తిలో నాణ్యత విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని ఉద్యోగులకు సూచనలు చేసింది. రానున్న కాలంలో మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే నాణ్యత చర్యలు కీలకంగా మారాయి. దీంతో సింగరేణి ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది.

## ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా :

### కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత, బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ...





కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా అందరికీ అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నామన్నారు.

## అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ...ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులను చేపట్టి పూర్తిచేస్తాం : బిఆర్ ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు....

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా) కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ 22వ వార్డుకు చెందిన డ్రీమ్ వ్యాలీ, ఇందిరమ్మ కాలనీ ఫేస్ - 1, గ్రీన్ పార్క్ కాలనీవాసులు మాజీ వార్డు సభ్యులు సంధ్యా హనుమంతరావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని కలిసి ఆయా కాలనీలలో మౌలిక వసతులు అన్ని దాదాపు పూర్తయ్యాయని, అక్కడక్కడ మిగిలిపోయిన సిసి రోడ్డు నిర్మాణం, డ్రీమ్ వ్యాలీ నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు లింక్ రోడ్డు ఏర్పాటు, ఇందిరమ్మ కాలనీ ఫేస్ -1 లో మంచినీటి స్టోరేజ్ కోసం వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందిం





చిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నగర శివారు మున్సిపాలిటీ లైన దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలలో ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతుల కల్పన చేపట్టడం జరిగిందని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ఇంకేమైనా పనులు మిగిలిపోయి ఉంటే త్వరలోనే చేపట్టి పూర్తి చేస్తామన్నారు. అనంతరం సంబంధిత శాఖ అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడిన ఎమ్మెల్యే గారు మౌలిక వసతులైన సిసి రోడ్డు, వాటర్ ట్యాంక్, లింకు రోడ్డు పనులను త్వరీతగతిన చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

## మౌలిక సదుపాయాల కోసం వివిధ కాలనీ మరియు బస్తి ప్రజలు..

### నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి కి వినతిపత్రాలు..





కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ కాలనీ మరియు బస్తి ప్రజలు మౌలిక సదుపాయాలు కల్పించాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి కి తెలియజేసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం హన్మంతన్న సానుకూలంగా స్పందించి సదురు అధికారులతో మాట్లాడి విలైయింత త్వరలో పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు.

# రెండోసారీ.. నగరానికి నిరాశే

హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో రాజధానికి రెండోసారి కూడా ప్రాతినిధ్యం దక్కలేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచి అవకాశం కల్పించలేదు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరిగినా కచ్చితంగా ఒకరిద్దరికి అవకాశం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తూ వచ్చాయి. ఆ దిశగా కొందరి పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఆశావహులు దిల్లీ వెళ్లి అధిష్ఠానంతో లాబీయింగ్ చేశారు. కొందరికి కచ్చితంగా అవకాశం ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతూ వచ్చినా.. ఆదివారం జరిగిన మంత్రివర్గ విస్తరణతో ఈ ఊహాగానాలకు తెరపడింది.

రాజధాని పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మొత్తం 29 నియోజకవర్గాలున్నాయి. రాష్ట్ర జనాభాలో 40శాతం ఈ జిల్లాల పరిధిలో ఉంటున్నారు. ఎక్కువ జనాభా ఉన్నచోట ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం.. పార్టీ బలోపేతానికి, స్థానిక అభివృద్ధిపై ప్రభావం చూపిస్తుందనే చర్చ జరుగుతోంది.

కచ్చితంగా వస్తుందనుకున్నా.. 2023 డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో రాజధానిలో మూడు జిల్లాల నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి(ఇబ్రహీంపట్నం), వీర్లపల్లి శంకర్(షాద్‌నగర్) మాత్రమే కాంగ్రెస్ తరఫున గెలిచారు. కంటోన్మెంట్‌కు జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ విజయం సాధించారు. ఈ ముగ్గురిలో శంకర్, శ్రీగణేశ తొలిసారి ఎమ్మెల్యేలు. మల్‌రెడ్డి రంగారెడ్డి సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్నారు. దీంతో కచ్చితంగా అవకాశం ఉంటుందని ఆశపడ్డారు. ప్రభుత్వంలో మంచి ప్రాతినిధ్యం ఇస్తారనే ఆశతో కొందరు భారాస నుంచి గెలిచినా కాంగ్రెస్‌లో చేరారు. రాజధాని నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం దక్కితే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పట్టు సాధించేందుకు ఉపయోగపడుతుందని అధిష్ఠానానికి వినతులు వెళ్లాయి. సామాజిక సమీకరణాల్లో భాగంగా మంత్రివర్గ విస్తరణలో చోటుదక్కలేదు. దీంతో ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

# నాటే వరకే ఆసక్తి.. సంరక్షణకు స్వస్తి

గోదావరిఖని : ప్రభుత్వం చేపడుతున్న మొక్కల పెంపకం కార్యక్రమం సంరక్షణ, ప్రణాళిక లోపంతో నీరుగారిపోతోంది. ఏటా వర్షాకాలంలో భారీగా మొక్కలు నాటుతున్న అధికారులు సంరక్షణ గాలికొదిలేస్తున్నారు. దీంతో బృహత్తర కార్యక్రమం మొక్కుబడిగానే సాగుతోంది. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం.. ఈ ఏడాదైనా సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికా ప్రకారం ముందుకు వెళ్తే భావితరాలకు మేలు జరుగుతోంది.

**పదేళ్లలో 10 కోట్లు**

పదేళ్లలో ప్రభుత్వం హరితహారం, వన మహోత్సం వంటి పథకాల పేరిట నాటిని మొక్కలు చాలా వరకు కనిపించటం లేదు. ఉమ్మడి జిల్లాలో సుమారు 10 కోట్ల మొక్కలు నాటారు. రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో నాటిన మొక్కలు పశువుల మేత అవుతున్నాయి. కొన్ని నీరు లేక ఎండిపోయాయి. అటవీ, డీఆర్‌డీఏ, పురపాలక సంస్థలు



మొక్కల సంరక్షణను పట్టించుకోవటం లేదు. పైగా విద్యుత్తు సిబ్బంది తీగలకు అడ్డువస్తున్నాయని ఎదిగిన చెట్లను కొట్టేస్తున్నారు. ఏటా నాటిన మొక్క లెక్క మాత్రమే ఉంటుంది. సంరక్షణకు సంబంధించిన ఎలాంటి వివరాలు కనిపించటం లేదు.

**ప్రచారానికే పరిమితం**

ప్రభుత్వం మొక్కలు నాటే విషయంలో ప్రచారానికే పరిమితం అవుతోంది. ఎన్ని మొక్కలు నాటాం. వాటి రక్షణ చర్యలు, ప్రస్తుత పరిస్థితిపై అధికారుల వద్ద ఎలాంటి సమాచారం లేదు. నాటే వరకు మాత్రమే ఆసక్తి చూపుతున్న యంత్రాంగం.. సంరక్షణపై ఆలోచన చేయటం లేదు. ఖాళీ ప్రదేశాలు, రహదారుల పక్కన నాటిన మొక్కలు ఒకట్రెండ్రోజుల్లో కనిపించకుండపోతున్నాయి.

**సింగరేణి ఆదర్శం**

పచ్చదనం పెంపులో సింగరేణి ఆదర్శంగా నిలుస్తోంది. భారీ ఎత్తున మొక్కలు నాటి సంరక్షణకు పటిష్ఠ చర్యలు చేపడుతోంది. సంస్థకు చెందిన కొన్ని ప్రాంతాలు అడవులను తలపిస్తున్నాయి. యాజమాన్యం 25 ఏళ్లుగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తుండగా ఇప్పటివరకు 14,900 హెక్టార్లలో 7 కోట్ల మొక్కలు నాటింది. ఏటా 15 నుంచి 20 లక్షల మొక్కలు లక్ష్యంగా పెట్టుకుంటోంది. సంస్థ నాటిన ప్రతి మొక్కకు రక్షణ కల్పిస్తోంది. ఇప్పటివరకు 80 శాతం మొక్కలు వృక్షాలుగా ఎదిగాయి. ఉపరితల గనుల మట్టి కుప్పలు, రహదారులకు ఇరవైపులా, అటవీ క్షేత్రాలను(బ్లాక్ ఫారెస్టు) పెంచుతోంది.

మట్టి కుప్పలపై మీటరు మందంతో ఎర్ర లేదా నల్ల మట్టి నింపి అటవీ జాతికి చెందిన మొక్కలు నాటుతారు.

రహదారుల పక్కన నాటిన మొక్కలకు కంచె ఏర్పాటు చేసి.. ప్రతి రోజూ నీరు పోస్తారు. సంరక్షించిన వాటికే గుత్తేదారుకు బిల్లు చెల్లిస్తారు. ఏ చోటైనా మొక్క నాటుకోని పక్షంలో అదే ప్రాంతంలో మరో మొక్కను నాటిస్తారు. 100 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంలో ఒక ప్రాంతాన్ని ఎంచుకొని చదును చేస్తారు. మొక్కలు నాటి పశువులు అందులోకి రాకుండా చుట్టూ కందకం తీస్తారు. సిబ్బందిని నియమించి నిరంతరం పర్యవేక్షిస్తారు. నాటిన నుంచి నాలుగేళ్లు నిర్వహణ బాధ్యత గుత్తేదారుకే అప్పగిస్తారు. ఏటా పెరుగుదల ఆధారంగా బిల్లు చెల్లిస్తారు. సంరక్షణ శాతం పడిపోతే గుత్తేదారుకు జరిమానా విధిస్తారు.

# మహానగరంలో మాయగాళ్ల నయా ట్రెండ్



హైదరాబాద్ : కాలనీలో ఉంటాడు.. ఖరీదైన కార్లలో తిరుగుతాడు. ఆర్భాటంతో ఎప్పుడూ పదిమంది వెంట ఉంటారు. ఏ పండుగ జరిగినా.. ఊరేగింపు నిర్వహించినా చందాలిస్తాడు. ఇదంతా బయటకు కనిపించే దర్పం. ఇదే నమ్మకాన్ని సొమ్ముగా మలచుకునేందుకు చేసే ప్రయత్నమని గుర్తించేలోపు రూ.కోట్లు కాజేసి ముఖం చాటేస్తాడు. ఇదీ మహానగరంలో మాయగాళ్ల నయా ట్రెండ్. స్టాక్‌మార్కెట్, విదేశీ కంపెనీలు, స్థిరాస్తి రంగం.. అన్నింటా తామేనంటూ మాటలతో మభ్యపెడుతూ అమాయకులను నిండా ముంచుతున్నారు. తాజాగా మలక్‌పేటకు చెందిన ఇద్దరు స్నేహితులు.. తమ వ్యాపారాల్లో పెట్టుబడి పెడితే ఊహించని లాభాలంటూ ఊదరగొట్టి రూ.50 కోట్ల మేర వసూలు చేశారు. మూడేళ్లుగా సాగిన దొంగాట సీసీఎస్ పోలీసుల రంగప్రవేశంతో బట్టబయలైంది. ఇదే తరహాలో నగర శివారున గొలుసుకట్టు మోసాలకు వేలాది మంది బలవుతున్నట్టు పోలీసులు గుర్తించారు.

**ఇప్పుడేం జరుగుతుందంటే..**

పెద్దఎత్తున కమీషన్ ఆశచూపి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లతో ప్రచారం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకుంటున్నారు. బంగారం, ఉక్కు, ఫార్మా, స్టాక్‌మార్కెట్, రియల్‌ఎస్టేట్ రంగాల్లో పెట్టుబడులతో రాత్రికిరాత్రే తలరాత మార్చుకోవచ్చంటున్నారు. ఖరీదైన హోటళ్లలో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. తమ ఏజెంట్లనే సభ్యులుగా చూపుతున్నారు. ఇది నిజమని నమ్మి సభ్యులుగా చేరుతున్నారని ఓ పోలీసు అధికారి తెలిపారు. ప్రస్తుతం బంగారం ధర పెరగటంతో మహిళలను ఆకట్టుకునేందుకు గోల్డ్ స్కీమ్ పేరిట ఒక ముఠా డబ్బు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

**ఎందుకిలా మోసపోతున్నారంటే..**

గతేడాది ఓ మోసగాడు వెల్‌నెస్ సెంటర్లలో సభ్యులుగా చేరమంటూ.. వందలాది మందితో పెట్టుబడులు పెట్టించాడు. లావాదేవీల్లో ఎక్కడా తన పేరు రాకుండా కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలను ఉపయోగించాడు. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న నిందితుల్లో అధికశాతం స్థానికంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నవారే. విలాసవంతమైన జీవితం గడుపుతున్నట్టు కనిపిస్తారు. సంస్థలో చేరిన సభ్యులకు నాలుగైదు నెలలు చెప్పినట్టు కమీషన్, లాభాలు జమ చేయిస్తారు. కొత్త సభ్యులను చేర్పించిన వారికి బోనస్‌గా రెట్టింపు కమీషన్ ఇచ్చి నమ్మకం పెంచుతున్నారు. పెద్దమొత్తంలో డబ్బు చేతికి అందాక ముఖం చాటేస్తున్నారు.

# హవాలా రాకెట్.. నేరగాళ్లతో సిండికెట్



హైదరాబాద్: నగరానికి చెందిన హవాలా వ్యాపారి మాదకద్రవ్యాల ముఠాలతో చేతులు కలిపి విదేశాలకు నగదు చేరవేస్తున్నాడు. మూడేళ్లుగా గుట్టుగా సాగిన దందాను పోలీసులు బట్టబయలు చేశారు. ఏటా రూ.2 కోట్ల వరకు అమెరికా, యూకేలోని బంధువులు, స్నేహితుల బ్యాంకు ఖాతాలకు తరలించాడు. కమీషన్ రూపంలో రూ.60లక్షలకు పైగా జేబులో చేరినట్టు దర్యాప్తులో నిర్ధారించారు. ఇప్పటి వరకు నల్లధనం మార్పిడిలో బడా వ్యాపారులకు సహకరించిన హవాలా దళారులు డ్రగ్స్, సైబర్ ముఠాలకు సహకరిస్తున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే సుమారు 20 మంది హవాలా నిర్వాహకులను గుర్తించారు. తాజాగా గోవా కేంద్రంగా డ్రగ్ రాకెట్ నడుపుతున్న నలుగురు నైజీరియన్లలో ఒకరిని టీజీ న్యాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మత్తు పదార్థాలు విక్రయించగా వచ్చిన కమీషన్ రూ.కోటిన్నర విదేశాల్లోని 150 బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్టు గుర్తించారు. ఈ వ్యవహారంలో ముంబయికి చెందిన హవాలా ఆపరేటర్స్ సహకరించినట్టు అంచనాకు వచ్చారు.

**ఆనవాళ్లు దొరక్కుండా ఇలా..**

గోవా, ముంబయి, బెంగళూరు, చెన్నై, రాజస్థాన్ నుంచి సింథటిక్ డ్రగ్స్ కొరియర్, ప్రైవేటు బస్సుల్లో నగరానికి చేరుతున్నాయి. గ్రాముల చొప్పున డ్రగ్స్‌ను ప్యాకెట్లుగా మార్చి కొనుగోలుదారులకు చేరవేస్తున్నారు. వారి నుంచి నగదును పాన్, కిరాణా దుకాణాలు, పెట్రోల్ బంకుల్లోని యూపీఐ ఖాతాలో జమచేయిస్తున్నారు. వారికి రూ.1000కి రూ.100 కమీషన్ ఇచ్చి నగదు తీసుకుంటున్నారు. రూ.లక్షల్లో నగదు జమయ్యాక.. ఆ సొమ్మును మనీట్రాన్స్‌ఫర్, మినీ ఏటీఎం, హవాలా ఆపరేటర్స్‌కు 10 నుంచి 20 శాతం కమీషన్ ఇచ్చి దేశ, విదేశాల్లోని కీలక సూత్రధారుల బ్యాంకు ఖాతాలకు మళ్లిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరుకు చెందిన హవాలా ఆపరేటర్లు కీలకంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల పట్టుబడిన వారిలో కొందరు డ్రగ్స్ కేసు నుంచి తప్పించమని పోలీసులతో బేరసారాలు నడిపినట్టు ఆరోపణలు ఉన్నాయి.

**క్రిప్టో.. బిట్‌కాయిన్‌గా సైబర్ సొత్తు..**

డ్రగ్స్ ముఠాల పద్ధతినే సైబర్ మాయగాళ్లు అనుసరిస్తున్నారు. వ్యాపారులు, చిరుద్యోగులు, ఆటోడ్రైవర్లు, కూలీల బ్యాంకు ఖాతాలను కొనుగోలు చేస్తున్నారు. బాధితుల నుంచి కొట్టేసిన సొమ్మును వాటిలో జమ చేస్తున్నారు. వెంటనే ఏటీఎం కేంద్రాల నుంచి నగదు విత్‌డ్రా చేసి హవాలా వ్యాపారుల ద్వారా విదేశాలకు చేరవేస్తున్నారని ఒక పోలీసు అధికారి తెలిపారు. బాధితులు నష్టపోయిన సొమ్ము తిరిగి ఇస్తామని వారినే ఏజెంట్లుగా మార్చుకుంటున్నారు. వారికి ఆన్‌లైన్‌లో శిక్షణనిచ్చి బ్యాంకు ఖాతాల్లోని నగదును క్రిప్టో, బిట్‌కాయిన్‌గా మార్పించి దుబాయ్, హాంకాంగ్, సింగపూర్ తరలిస్తున్నారు. బిట్‌కాయిన్, క్రిప్టోగా మారాక వెనక్కి తీసుకురావటం అసాధ్యమంటున్నారు. హవాలా ఆపరేటర్స్‌పై కేసులు నమోదు చేయటం ద్వారా లింకులను ఛేదించొచ్చని వివరించారు.

# రూ.కోట్లు వస్తున్నా.. తప్పని పాట్లు



వికారాబాద్ : రైతు ఆర్థికాభివృద్ధికి దోహదపడే వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలు కొరవడ్డాయి. కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు వెళితే నిత్యం అవస్థలు పడక తప్పడం లేదు. ప్రతినెలా యార్డుల్లో రూ.కోట్లలో క్రయ విక్రయాలు సాగుతున్నాయి. సెస్సు రూపంలో ఆదాయం సమకూరుతున్నా సౌకర్యాల కల్పన మాత్రం ఎండమావిగానే మారింది. జిల్లాలోని పరిగి, తాండూరు, వికారాబాద్, మర్పల్లి, ధారూర్, కోట్‌పల్లి, కుల్కచర్ల, బషీరాబాద్, కొడంగల్, నవాబుపేట మండల కేంద్రాల్లో మార్కెట్లు నడుస్తున్నాయి. ముఖ్యమంత్రి జిల్లా కావడంతో వీటి రూపురేఖలు మారనున్నాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

**లక్ష్యానికి మించి ఆదాయం**

ఆయా మార్కెట్ యార్డుల నుంచి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 21.98 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా.. రూ.28.16 కోట్ల మేరకు సమకూరింది. అంతర్గత రహదారులు, వీధి దీపాలు, మంచినీటి సదుపాయం, రైతు విశ్రాంతి గదులు, ధాన్యం ఆరబోసుకునేందుకు ప్రత్యేకించి కవర్ షెడ్లు లేకపోవడం, జనరేటర్ లేక అంధకారం అలముకోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. నవాబుపేట మినహా మిగతా తొమ్మిది వ్యవసాయ మార్కెట్ యార్డులన్నీ నిర్దేశిత లక్ష్యం కన్నా ఎక్కువ ఆదాయం సాధించాయి. రూ.కోట్ల నిధులు వస్తున్నా పాట్లు మాత్రం తప్పడం లేదని వాపోతున్నారు. కుల్కచర్ల యార్డు రూ.39.54 లక్షలకుగాను రూ.1.62 కోట్లు ఆదాయాన్ని పొంది జిల్లాలోనే నంబర్‌వన్‌గా నిలిచింది. యార్డు ఒక చోట.. వ్యాపార లావాదేవీలు మరోచోట జరుగుతున్నాయి. ప్రత్యేకించి కార్యదర్శి లేకపోవడంతో పరిగి కార్యదర్శి ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఇటు పరిగి అటు కుల్కచర్లలో సిబ్బంది కొరత ఉంది. పరిగిలో ప్రతి శుక్ర, మంగళవారాల్లో యార్డును నిర్వహిస్తున్నారు. కరెంటు పోతే చిమ్మచీకట్లోనే తూకాల నిర్వహణతో రైతులకు నష్టం కలుగుతోంది. కనీసం తాగేందుకు మంచినీరైనా దొరకడం లేదు. **దశల వారీగా సమస్యల పరిష్కారం..**

మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తున్నాం. సుమారు రూ.20 కోట్ల అంచనా వ్యయంతో యార్డుల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాం. ఇప్పటికే కొన్ని మంజూరు కాగా.. మరికొన్ని టెండర్ల దశలో ఉన్నాయి. కార్యాలయాలు, ప్రహరీల ఏర్పాటు, గోదాంలు, కవర్ షెడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నాం. బంట్వారంలో నూతనంగా మేకల సంతను ప్రారంభించేందుకు కలెక్టర్ స్థలం కేటాయించారు. సుమారు రూ.50లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి చేస్తాం. సారంగపాణి, జిల్లా సహాయ సంచాలకుడు, మార్కెటింగ్ శాఖ

# హెచ్‌ఎండీఏలో పరిపాలన జోన్లు

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ)ను త్వరలో పరిపాలన సౌలభ్యం కోసం వికేంద్రీకరణ చేసే దిశగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధి ఏడు జిల్లాల్లో విస్తరించి ఉంది. త్వరలో మరో 3 వేల కి.మీ.ల మేరకు పెరగనుంది. ప్రాంతీయ రింగ్‌రోడ్డు దాటిన తర్వాత 2 కి.మీ.ల వరకు హెచ్‌ఎండీఏ గ్రోత్ కారిడార్ కింద రానుంది. అక్కడి వరకు ప్లానింగ్, ఇంజినీరింగ్ ఇతర కార్యకలాపాలన్నీ హెచ్‌ఎండీఏ పరిధిలోకి రానున్నాయి. ఇప్పటివరకు బల్దియా మాదిరి ప్రత్యేక జోనింగ్ వ్యవస్థ లేదు. కేవలం ప్లానింగ్ విభాగాన్ని మాత్రమే ఆరు జోన్లుగా విభజించారు. ఏడు జిల్లాల పరిధిలో లేఅవుట్లు, నిర్మాణాల కోసం హెచ్‌ఎండీఏను ఆశ్రయించాల్సి వస్తోంది. సంగారెడ్డి, యాదాద్రి జిల్లాల నుంచి హైదరాబాద్‌కు రావాలి. ఇది వ్యయప్రయాసలతో కూడుకున్నది. పెరిగిన పరిధి చూస్తే ఇప్పుడున్న సిబ్బందికి రెండింతలు అదనంగా అవసరం. దీంతో వికేంద్రీకరణకు యోచిస్తున్నారు.

**జోన్ స్థాయిలోనే పనులు...**

ప్రస్తుతం ప్రణాళిక విభాగంలో ఆరు జోన్లు ఉన్నాయి. సిబ్బంది, అధికారులు నగరం నుంచే సేవలు అందిస్తున్నారు. పరిపాలన జోన్లు ఏర్పాటైతే క్షేత్రస్థాయి నుంచి మొత్తం విభాగాలు పని చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ప్రతి జోన్‌కు కమిషనర్, ప్లానింగ్ అధికారులు, సీఈ, ఎస్‌ఈలు ఉంటారు. జోన్ స్థాయిలోనే పనులు పూర్తి చేస్తారు. రానున్న మెగా మాస్టర్ ప్లాన్‌తోపాటు పరిపాలన వికేంద్రీకరణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుతంహెచ్‌ఎండీఏ విస్తీర్ణం: 7,257 చ.కి.మీ.లు
విస్తరించనున్న పరిధి: 10,472.72 చ.కి.మీ.లు
ప్రస్తుతం ఉన్న జిల్లాలు: 07
కొత్త వాటితో కలిపి: 11
మొత్తం మండలాలు: 104
మొత్తం గ్రామాలు: 1355

# అవకాశాల అక్షయపాత్ర

పెద్దపల్లి : సెల్‌ఫోన్, టీవీ, కంప్యూటర్ ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరుగుతోంది. వీటి తయారీలో కీలకమైన సెమీకండక్టర్ రంగంలో అవసరాలకు సరిపడా ఉత్పత్తి లేక ఇండియా ఇతర దేశాల వైపు చూడాల్సి వస్తోంది. ఈ రంగం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుండగా.. నైపుణ్యం, పెట్టుబడులు, మౌలిక వసతులు కల్పిస్తే ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించనున్నాయి.

**వచ్చే ఏడాది గణనీయ ఉత్పత్తి**

మన దేశంలో సెమీకండక్టర్ల రంగంలో 2021 నాటికి 9 శాతం మాత్రమే దేశీయంగా ఎలక్ట్రానిక్ పరికరాలు ఉత్పత్తి అవుతున్నాయి. 2026 నాటికి 17 శాతం పెంచేలా కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. పెద్దస్థాయిలో చిప్స్ తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తోంది. గుజరాత్‌లో 2, అసోంలో ఒక పరిశ్రమ స్థాపనకు శంకుస్థాపన చేశారు. ఇక్కడ 2029 నాటికి చిప్స్ ఉత్పత్తి ప్రారంభం కానుంది.

**సన్నద్ధత ఇలా..** దేశీయ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడం
ఇస్రో, డీఆర్డీవో, బీఈఎల్, ఎస్‌ఈఎల్ పరిశోధనా సంస్థలు ఆధునిక పరికరాలపై అధ్యయనం
డీఎల్ఐ పథకంలో దేశీయ సంస్థలకు స్టార్టప్‌లో ఆర్థిక సహకారం
ఎలక్ట్రానిక్ చిప్స్ ఎగుమతులకు డిమాండ్ పెరిగేలా చర్యలు తీసుకోవడం. మార్కెట్ అవసరాలు, ఉపాధి రంగాల్లో ప్రతిభ చాటేందుకు సన్నద్ధం చేయడం

ఇదే మంచి తరుణం

ఇంజినీరింగ్, కెమికల్స్ సైన్స్ ఎలక్ట్రానిక్ విభాగాల్లో చదువుతున్న విద్యార్థులకు భవిష్యతులో మంచి అవకాశాలు రానున్నాయి. విద్యార్థులు ఎలక్ట్రానిక్ బ్రాంచ్‌లను ఎన్నుకుంటే చదువు పూర్తయ్యేవరకు



సెమీకండక్టర్ డిజైన్, తయారీ, టెస్టింగ్ రంగాల్లో పట్టు సాధించవచ్చు దేశంలో వచ్చే పదేళ్లలో ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు జరగనున్నాయి. ఇతర దేశాలపై ఆధారపడకుండా సొంతంగా ఉత్పత్తులు తయారు చేసుకునే అవకాశం లభించనుంది.

**ఇవీ లోపాలు**

సరైన నైపుణ్యం, శిక్షణ శ్రామికుల కొరత
ఇంజినీరింగ్ యువత లోతైన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోకపోవడం
నూతన టెక్నాలజీ అభివృద్ధిలో అధిక మూలధన పెట్టుబడుల కొరత

భవిష్యత్తులో మెరుగైన ఉపాధి

ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీలో సెమీ కండక్టర్ రంగం కీలకం. సరైన నైపుణ్యాలు, శిక్షణ అవకాశాలను అందిపుచ్చుకుంటే ప్రతిభ మెరుగవుతుంది. ఇంజినీరింగ్‌లో చేరే విద్యార్థులు ఉపాధి అవకాశాలు లభించే బ్రాంచ్‌లను ఎన్నుకోవాలి. సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వం పరిశ్రమలు స్థాపించడంతో భారీగా ఉపాధి పెరగనుంది. రమేశ్, ప్రొఫెసర్(ఈసీఈ), హుజూరాబాద్

**ఉపాధి కోర్సులను ఎన్నుకోవాలి** సెమీకండక్టర్ల తయారీలో పురోగతి సాధిస్తున్నాం. ఆధునిక డిజైన్లను తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పరిశోధనా సంస్థలు సహకారం అందిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ వస్తువులకు అవసరమైన చిప్స్ కొనుక్కునే పరిస్థితి ఉండదు. శ్రీనివాస్, ప్రొఫెసర్(ఈసీఈ) పెద్దపల్లి

# భారత యువకుడిదే తప్పు.. అమెరికాలో అమానుషంపై స్పందించిన విదేశాంగ శాఖ

అమెరికాలోని నెవార్క్ విమానాశ్రయంలో ఓ భారతీయ యువకుడిపై జరిగిన సంఘటన ఇప్పుడు తీవ్ర చర్చకు దారి తీసింది. అక్కడి భద్రతాధికారులు అతనిపై చూపిన దాడి లాంటి వ్యవహారం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చి ప్రపంచవ్యాప్తంగా విమర్శల కు గురవుతోంది. దీనిపై భారత విదేశాంగశాఖ కూడా స్పందించింది.

**-విదేశాంగ శాఖ ప్రకటన...** భారత విదేశాంగశాఖ తెలిపిన వివరాల ప్రకారం.., హరియాణాకు చెందిన ఆ యువకుడు సరైన వీసా లేకుండా అక్రమ మార్గంలో అమెరికాలోకి ప్రవేశించాడు. ఇది చట్టవిరుద్ధం అని, విదేశీ నిబంధనలు అతడు ఉల్లంఘించిన విషయాన్ని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. "ఆ యువకుడి ప్రవర్తన ప్రయాణ సమయంలో సరిగాలేదు. వీసా లేకుండా ప్రవేశించిన కారణంగా అతని మీద అక్కడి అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి మెరుగవుతోందని, అతన్ని భారత్‌కు తిరిగి పంపించేందుకు అక్కడి అధికారులతో సంప్రదింపులు



జరుగుతున్నాయి" అని భారత విదేశాంగశాఖ వర్గాలు వెల్లడించాయి.

**-అమెరికా భద్రతాదళాల చర్యలపై భారత్ అసంతృప్తి:** అయితే అక్రమంగా వెళ్లడం తప్పని తేలినా, ఆ యువకుడిపై అమెరికా భద్రతాధికారులు ప్రదర్శించిన హింసాత్మక ప్రవర్తనపై భారత్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. మానవ హక్కులను ఉల్లంఘించేలా ఆయనను నేలపై పడేసి, చేతులు వెనక్కి మడిచేలా బంధించడం ఖండనీయం అని పేర్కొంది. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ప్రజల ఆగ్రహానికి దారి తీశాయి. ఇప్పటికే అమెరికా ప్రభుత్వం ట్రంప్ పాలన ప్రారంభమైన నాటినుంచి అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటోంది. అప్పటి నుంచి పలువురు భారతీయులు కూడా అరెస్టై, మళ్లీ భారత్‌కు పంపించబడ్డారు.

**-యువతకు గుణపాఠం – ప్రభుత్వాల బాధ్యత:** భారత ప్రభుత్వం ఇప్పటికే తమ పౌరులకు ఇతర దేశాలకు వీసా లేకుండా ప్రయాణించరాదని పలుమార్లు హెచ్చరించింది. అయినా కొన్ని చోట్ల యువకులు అక్రమ మార్గాల్లో ప్రయాణిస్తున్న ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. నెవార్క్ ఘటన కూడా అలాంటిదే. ఈ ఘటన భారత యువతకు గుణపాఠంగా నిలవాలి. చట్టబద్ధమైన మార్గాల ద్వారా మాత్రమే విదేశాలకు ప్రయాణించాలి. ఇదే సమయానికి విదేశీ ప్రభుత్వాలు కూడా మానవ హక్కుల పరిరక్షణలో శ్రద్ధ చూపాలని భారత్ మరోసారి గుర్తుచేసింది.

# 2027 జనగణనలో ప్రత్యేకతలివే..






భారతదేశంలో 16 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ జనగణన ప్రారంభం కానుంది. 2027, మార్చి 1వ తేదీని ఈ జనగణనకు ప్రామాణిక తేదిగా తీసుకుంటామని కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈసారి జనగణన చరిత్రలో తొలిసారిగా పూర్తిగా డిజిటల్ రూపంలో నిర్వహించనున్నారు.

**– జనగణన అంటే ఏమిటి?...** జనగణన అనేది దేశ ప్రజల సంఖ్య, వారి వయసు, లింగం, విద్యా స్థాయి, వృత్తి, మతం, భాష, నివాస స్థితి, కుటుంబ వివరాలు, కులాలు తదితర అంశాలను సేకరించే వ్యవస్థ. ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ప్రభుత్వం ఈ లెక్కల ఆధారంగా తెలుసుకుని తదనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రూపొందిస్తుంది. భారతదేశంలో తొలి జనగణన 1872లో ప్రారంభమైంది. స్వాతంత్ర్యం తరువాత ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి ఈ ప్రక్రియ జరుగుతుంది. 2011లో చివరి సారిగా జనగణన జరిగింది. అయితే 2021లో జరగాల్సిన జనగణన కరోనా మహమ్మారి కారణంగా వాయిదా పడింది.

**ఈసారి ప్రత్యేకతలు ఏమిటి?...** ఈసారి జరగబోయే జనగణనలో కొన్ని ముఖ్యమైన మార్పులు ఉన్నాయి. మొట్టమొదటిసారి జనగణన పూర్తి డిజిటల్ రూపంలో ఉంటుంది.

డేటా సేకరణకు మొబైల్ యాప్‌లు, ట్యాబ్‌లు వాడుతారు. 1931 తర్వాత ఈసారి జనగణనలో ప్రతి ఒక్కరి కుల వివరాలను అడుగుతున్నారు. ఇది దేశ రాజకీయ, సామాజిక వ్యవస్థపై ప్రగాఢ ప్రభావం చూపనుంది. 2026 అక్టోబర్ 1 నుంచి హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాల్లో ప్రారంభం. 2027 మార్చి 1 నుంచి మిగిలిన రాష్ట్రాల్లో జరుగుతుంది. ఈ గణన ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేయనున్నారు. అలాగే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కూడా అమలు చేస్తారు.

**– జనగణన ఆలస్యానికి కారణం?...** 2021 జనగణనకు అన్ని ఏర్పాట్లు పూర్తయినప్పటికీ, కరోనా మహమ్మారి కారణంగా వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తర్వాతి కాలంలో కోవిడ్ ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాతే కొత్త తేదీలను ప్రకటించారు.

**–దక్షిణాది రాష్ట్రాల ఆందోళన...** డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జనాభా పెరుగుదల తగ్గిన రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని వారు భావిస్తున్నారు. కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా ఈ అంశంపై రాష్ట్రాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

**బడ్జెట్ వ్యయాలు...** 2021–22 బడ్జెట్‌లో జనగణన కోసం రూ.3,768 కోట్లు కేటాయించగా, 2024–25 బడ్జెట్‌లో రూ.574.80 కోట్లు కేటాయించారు. జనగణనకు నిధుల కొరత ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈసారి జరగబోయే 2027 జనగణన భారత దేశ రాజకీయ, సామాజిక రంగాల్లో ఎన్నో కీలక మార్పులకు దారితీయనుంది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలు, కుల గణన వల్ల కొత్త దిశలో దేశ పరిపాలన సాగనుంది. ఈ గణన ఫలితాల ప్రభావం 2029 ఎన్నికల వరకు కనిపించకపోయినా, ఆ తర్వాతి రాజకీయ చరిత్రను మలుపుతిప్పే అవకాశముంది.

# ప్రపంచ క్రికెట్ లో తదుపరి ఫ్యాబ్-4 వీళ్లే... భారత్ నుంచి ఇద్దరు

ఏ క్రీడలోనైనా ఒకే సమయంలో ఆడేవారిని సరిపోల్చుతూ ఉంటారు. ఫుట్ బాల్ లో క్రిస్టియానో రొనాల్డో, లయోనల్ మెస్సీ, టెన్నిస్ లో రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్, జకోవిచ్, క్రికెట్ లో విరాట్ కోహ్లి, జో రూట్, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్.. మేటి ఆటగాళ్లయిన వీరు సమకాలీనులు. కొన్నిసార్లు ఒకే టైమ్ లో ఇద్దరు దిగ్గజాలు ఉండొచ్చు. కొన్నిసార్లు ఎక్కువ మంది ఉండొచ్చు. ఇప్పుడు క్రికెట్ లో విరాట్ కోహ్లి, జో రూట్, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్ లను దిగ్గజాలుగా పేర్కొంటున్నారు. ఫ్యాబులస్ (ఫ్యాబ్) 4గా వీరిని చెబుతారు. మిగతా ముగ్గురి సంగతి ఎలా ఉన్నా.. కోహ్లి టి20లు, టెస్టులకు రిటైర్మెంట్ ఇచ్చేశాడు. జో రూట్ టెస్టుల్లో 16 వేల పరుగులు సాధించేవాడిలా కనిపిస్తున్నాడు. 35 ఏళ్ల స్మిత్ 10 వేల పరుగులు దాటేశాడు. విలియమ్సన్ గాయాల నుంచి కోలుకుని మళ్లీ గాడిన



పడ్డాడు. టెస్టుల్లో 9 వేల పరుగులకు చేరుకున్నాడు. ఇతడు 10 వేలు దాటడం ఖాయమే. అయితే, నలుగురూ 35 ఏళ్లకు దగ్గరగా ఉన్నారు. మరో మూడేళ్లు ఆడతారేమో? మరి వీరి తర్వాత ప్రపంచ క్రికెట్ లో ఫ్యాబ్ 4గా నిలిచే సత్తా ఎవరికి ఉంది...? ఈ ప్రశ్నకు విలియమ్సన్ సమాధానం చెప్పాడు.

**తొలిసారి ఇద్దరు భారత కుర్రాళ్లు..** విలియమ్సన్ అంచనా ప్రకారం.. టీమ్ ఇండియా కొత్త టెస్టు కెప్టెన్ శుబ్ మన్ గిల్, యువ ఓపెనర్ యశస్వి జైశ్వాల్, భారత సంతతికి చెందిన న్యూజిలాండ్ సంచలనం రచిన్ రవీంద్ర, ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్ హ్యారీ బ్రూక్ లు తదుపరి ఫ్యాబ్ 4 జాబితాలో ఉన్నారు. గిల్, జైశ్వాల్ ఒకేసారి ఫ్యాబ్ 4 కేటగిరీకి ఎక్కే అవకాశం ఉండడం విశేషం. అయితే, ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ కామెరూన్ గ్రీన్ కూడా వీరి సరసన చోటిచ్చాడు విలియమ్సన్. అప్పుడు ఫ్యాబ్ 5 అవుతుందేమో? విలియమ్సన్ అంచనా చాలావరకు కరెక్టే. జైశ్వాల్ ఇప్పటికే తానేమిటో నిరూపించుకున్నాడు. గిల్ కెప్టెన్ కూడా అయ్యాడు. బ్రూక్ మహా దూకుడైన బ్యాటర్. రచిన్ రవీంద్ర ప్రపంచ కప్ లు సహా పెద్ద టోర్నీల్లో అదరగొట్టాడు. గ్రీన్ మాత్రం ఇంకా ఎదగాల్సి ఉంది. అయితే, వీరిలో ఎవరు నిజమైన దిగ్గజంగా ఎదుగుతారో తెలియాలంటే కొన్నేళ్ల ఆగాల్సిందే. అంటే.. కాలమే సమాధానం చెబుతుంది అన్నమాట.

## సినిమా 'షో'

# రష్మిక 'చెన్నై' పోస్ట్.. కన్నడిగులు ఫీల్ అయ్యారా?

స్టార్ హీరోయిన్ రష్మిక.. ఇప్పుడు కెరీర్ లో ఓ రేంజ్ లో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. నార్త్ టు సౌత్ వరుస సినిమాలతో అలరిస్తున్నారు. నాన్ స్టాప్ గా షూటింగ్స్ తో బిజీగా గడుపుతున్నారు. ఇప్పుడు కుబేర మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. జూన్ 20వ తేదీన వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా రిలీజ్ కానుందీ చిత్రం. కుబేరలో కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, టాలీవుడ్ కింగ్ నాగార్జున లీడ్ రోల్స్ పోషించగా.. రష్మిక ఫిమేల్ లీడ్ లో కనిపించనున్నారు. అయితే పాన్ ఇండియా మూవీ కనుక.. మేకర్స్ సినిమాను అంతే విధంగా ప్రమోట్ చేస్తున్నారు. అదే సమయంలో రష్మిక.. ప్రమోషన్స్ లో చురుగ్గా పాల్గొంటున్నారు. తన వంతు న్యాయంగా ప్రమోట్ చేస్తున్నారు. రీసెంట్ గా చెన్నైలో జరిగిన ఈవెంట్ లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారని చెప్పాలి. ప్యాస్టల్ కలర్ సూపర్ డ్రెస్ లో తళుకుమన్న భామ.. తన గ్లామర్ తో మెప్పించారు. ఇప్పుడు ఆ పిక్స్ ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అమ్మడు.. లాంగ్ నోట్ ను రాసుకొచ్చారు. చెన్నైతో తనకున్న అనుబంధాన్ని షేర్ చేసుకుంటూ, టీమ్ కోసం మాట్లాడారు. "కుబేరా ప్రమోషన్లను చెన్నైలో ప్రారంభించాం. మీలో చాలా మందికి తెలిసినట్లుగా చెన్నైలోనే నా



బాల్యం గడిచింది. దీంతో నా హృదయంలో చెన్నై ప్రియమైన స్థానాన్ని కలిగి ఉంది. ఎంత అద్భుతమైన సాయంత్రం అది!" అంటూ రాసుకొచ్చారు రష్మిక. కుబేర టీమ్ క్రియేట్ చేసిన మ్యాజిక్ కోసం వెయిట్ చేయండని కోరారు. అయితే చెన్నైకి తన హృదయంలో ప్రత్యేక స్థానమని పెట్టిన రష్మిక పోస్ట్.. కొందరు కన్నడిగులకు ఆగ్రహం తెప్పించిదట. ఆమెది చెన్నై అన్నట్లే పోస్ట్ పెట్టారని కొందరు అభిప్రాయపడుతున్నారు. పుట్టి పెరిగి స్కూల్ చదువుకున్నదంతా కర్ణాటకలో అయితే.. చెన్నైలో బాల్యం గడవడం ఏంటని ఇప్పుడు కన్నడ నెటిజన్లు అంటున్నారు. రష్మిక ఏ ఉద్దేశ్యంతో పెట్టారో గానీ.. ఇప్పుడు ఆ పోస్ట్ మాత్రం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కొద్ది రోజుల ముందు కన్నడ సూపర్ హిట్ కాంతార మూవీ చూడలేదని అనడంతో అనేక మంది ట్రోల్స్ చేశారు. ఆ తర్వాత హైదరాబాద్ తనకు ఇల్లు లాంటిదని వ్యాఖ్యానించడంతో విమర్శించారు. ఇప్పుడు చెన్నైలో బాల్యం గడిచిందని అనడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి దీనిపై రష్మిక స్పందిస్తారా వేచి చూడాలి.

# విదేశీయులతో శిల్పాశెట్టి భర్త గొడవకు కారణం?



సాగర కన్య శిల్పాశెట్టి, ఆమె భర్త ఇటీవల కొన్ని వివాదాల కారణంగా వార్తల్లో నిలిచారు. అయితే అంతా సద్దుమణిగింది అనుకుంటుండగానే, విదేశీయులతో రాజ్ కుంద్రా ఘర్షణ కారణంగా మరోసారి వార్తల్లోకి వచ్చారు. కుంద్రా – శిల్పాశెట్టి జంట క్రొయేషియా పర్యటనలో ఈ వివాదం తలెత్తింది. ఈ వివాదానికి సంబంధించిన వీడియో ఇంటర్నెట్ లో జోరుగా వైరల్ అయింది. అయితే ఈ వివాదానికి కారణమేమిటి? అన్నది ఆరా తీస్తే కుంద్రా చెప్పిన సంగతులు ఆశ్చర్యపరిచాయి. నేను నా భార్య 50వ పుట్టినరోజు కోసం ఘనంగా ప్లాన్ చేసుకున్నాను. శిల్పా, కొందరు అతిథులతో క్రొయేషియాలోని హెూటల్ లో టేబుల్ ను చాలా ముందుగా(సంవత్సరం క్రితం) బుక్ చేసుకున్నాను. కానీ ఏజెంట్ కారణంగా డబుల్ బుక్ అయింది. అదే టేబుల్ ని వేరొకరు బుక్ చేసుకున్నారు. దీంతో మా మధ్య ఘర్షణ మొదలైంది! అని రాజ్ కుంద్రా చెప్పారు. అంతేకాదు.. ఇలా జరగడానికి కారణాన్ని ప్రశ్నించగా, వారు %–%వెయిట్ చేయండి%–% అంటూ నిర్లక్ష్యంగా జవాబిచ్చారని, దీంతో నిరాశ మరింత పెరిగిందని కుంద్రా వాపోయాడు. నేను నా భార్య, పిల్లలు, వృద్ధ తల్లిదండ్రులు, అత్తగారు సహా 20 మంది అతిథులతో ఆ హెూటల్ వద్ద వెయిట్ చేయాల్సి వచ్చింది. ఎదురు చూస్తూ విసిగిపోయాము.. ఏజెంట్ తప్పిదాన్ని ప్రశ్నించాను.. అని రాజ్ కుంద్రా వెల్లడించాడు. కుటుంబం అతిథులతో ఆనందంగా జరగాల్సిన కార్యక్రమం తీవ్ర ఒత్తిడిని పెంచిందని కుంద్రా అన్నారు. బిజినెస్ మేన్ రాజ్ కుంద్రా వ్యాపారాల్లో తలమునకలుగా ఉన్నా కానీ, అతడు ఫ్యామిలీ మ్యాన్. కుటుంబానికి తగిన సమయం కేటాయించడానికి వెనకాడరు. ఇంతకుముందు పలు కోర్టు వివాదాల్లో శిల్పాశెట్టి తన భర్త కుంద్రాకు బలమైన అండగా నిలిచింది. ప్రస్తుతం క్రొయేషియాలో వెకేషన్ నుంచి శిల్పాశెట్టి ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తుండగా అవి వైరల్ గా మారాయి.

# ఈ ఏడాదితో పూజ ఫ్యూచర్ తేలిపోనుందా?

టాలీవుడ్ టాప్ స్టార్ హీరోల్లో దాదాపు అందరితోనూ హీరోయిన్‌గా నటించిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే ప్రస్తుతం తెలుగు సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈమె జోరు కొన్నాళ్లకే మసకబారింది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో నాలుగు.. ఐదు సినిమాలు ఉన్నాయి. అన్నీ కూడా హిందీ, తమిళ్ సినిమాలు కావడం విశేషం. తెలుగులో ఈ అమ్మడు మళ్లీ నటిస్తుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెలుగులో ఒకప్పుడు మోస్ట్ బిజీ హీరోయిన్‌గా ఉన్న ఈ అమ్మడు ఇప్పుడు ఒక్క తెలుగు సినిమా ఆఫర్ చేతిలో లేకపోవడంతో ఫ్యాన్స్ తెగ ఫీల్ అవుతున్నారని తెలుస్తోంది. ముందు ముందు అయినా ఈమె టాలీవుడ్‌లో రీ ఎంట్రీ ఇచ్చేనా అనేది అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఈమె చేస్తున్న సినిమాలు వరుసగా బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకోవడంతో పాటు, ఇండస్ట్రీ హిట్‌గా నిలిస్తే తప్పకుండా తెలుగు ఫిల్మ్ మేకర్స్ మరోసారి ఈమె వైపు తిరిగి చూసే అవకాశాలు ఉన్నాయి. ఇండస్ట్రీలో సక్సెస్‌లు ఉన్న వారికే ఆఫర్లు వస్తాయి. అదే ఫార్ములా ఖచ్చితంగా పూజా హెగ్డేకు వర్కౌట్ అవుతుంది. రాబోయే



ఏడాది కాలంలో పూజా హెగ్డే నుంచి కూలీ, హై జవానీ తో ఇష్క్ హెూనా హై, జన నాయగన్, కాంచన 4 సినిమాలు రానున్నాయి. ఈ నాలుగు సినిమాలు సూపర్ హిట్ కావడంతో పాటు, ఆ సినిమాల్లో ఈమె పాత్రకు మంచి గుర్తింపు దక్కడంతో పాటు, ఆమె నటన గురించి మాట్లాడుకుంటే అప్పుడు కోలీవుడ్‌లో ఛాన్స్ దక్కవచ్చు. టాలీవుడ్‌లోనే కాకుండా కోలీవుడ్, బాలీవుడ్‌లో ఈ అమ్మడు కంటిన్యూ కావాలన్నా కూడా ఆ సినిమాలు మంచి విజయాలను సొంతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఈ అమ్మడి కెరీర్ ఊగిసలాటలో ఉంది. ఆ సినిమాల ఫలితాలపైనే ఈమె యొక్క సినిమా కెరీర్ ఆధారపడి ఉంటుంది అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమె షేర్ చేస్తున్న అందమైన ఫోటోలను అభిమానులు తెగ ఇష్టపడుతున్నారు. కానీ సినిమాల్లో ఈమె పాత్రలను సైతం ఇష్టపడితేనే కెరీర్‌లో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. రాబోయే ఏడాది కాలం పాటు ఈమెకు గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.